# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఉగ్రవాదులను వారి ఇళ్లలోనే హతమార్చగలిగే సామర్థ్యం భారతదేశానికి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఖాళీ చేయించాలన్నదే భారత్ విధానమని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.
- ❖ సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్షా ఫలితాలను ఈ రోజు ప్రకటించింది.
- ❖ నైరుతి రుతుపవనాల ఆగమనం దృష్ట్యా గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని ఐఎండీ పేర్కొంది.

===================

ఉగ్రవాదులను వారి ఇళ్లలోనే హతమార్చగలిగే సామర్థ్యం భారతదేశానికి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈ రోజు పంజాబ్‌లోని ఆదంపుర్ ఎయిర్‌బేస్ ను సందర్శించిన సందర్భంగా జవాన్లను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని అభినందిస్తూ... భారతదేశం 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందని, పాకిస్తాన్‌లోని 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెడుతుందని నరేంద్రమోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదులు ఆధారపడిన పాకిస్తాన్ సైన్యాన్ని భారత సాయుధ దళాలు ఓడించాయని వివరించారు. అమాయక ప్రజల రక్తం చిందించడం వల్ల ఒకే ఒక ఫలితం ఉంటుందని ఉగ్రవాద నాయకులు ఇప్పుడు గ్రహించారని ప్రధానమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

===================

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఖాళీ చేయించాలన్నదే భారత్ విధానమని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ప్రకటించారు. ఈ రోజు ఆయన న్యూఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో పలు ప్రశ్నలకు

సమాధానమిచ్చారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో ఎలాంటి మార్పులు లేవని, కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం అవసరం లేదని స్పష్టం చేశారు. మే 10వ తేదీన పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ నుంచి ఫోన్ వచ్చిందని, ఆ క్రమంలో కాల్పుల విరమణపై నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ద్వైపాక్షిక విధానంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 39 సెకన్లు)

===================

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10, 12 తరగతి పరీక్షల ఫలితాలను ఈ రోజు ప్రకటించింది. 12వ తరగతిలో 83.39 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అమ్మాయిల్లో 91.64 శాతం, అబ్బాయిల్లో 85.70 శాతం మంది పాసయ్యారు. అత్యధికంగా విజయవాడలో 99.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆ తర్వాత తిరువనంతపురంలో 99.32 శాతం, బెంగళూరులో 95.95 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా ప్రయాగ్‌రాజ్‌లో 79.53 శాతం మంది పాసయ్యారు. 10వ తరగతిలో 93.66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలికలు, బాలురు కంటే 2.37 శాతం ఎక్కువగా ఉత్తీర్ణత సాధించారు.

===================

సీబీఎస్ఈ 10, 12 తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రోజు సీబీఎస్ఈ పరీక్షల ఫలితాలు విడుదలైన అనంతరం సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫలితాలు విద్యార్థుల దృఢసంకల్పం, క్రమశిక్షణ, కఠోర శ్రమకు దక్కిన ఫలితమని అన్నారు. ఈ పరీక్షల్లో విజయానికి దోహదం చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతరుల పాత్రను గుర్తుంచుకొనే రోజు కూడా ఇదేనని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ముందున్న జీవితంలో అద్భుతమైన ప్రయాణం ఉందనే విషయాన్ని, మార్కులు తక్కువ వచ్చాయని నిరుత్సాహంగా ఉన్న విద్యార్థులు గమనిచాలని సూచించారు.

===================

జమ్మూ కాశ్మీర్ షోపియన్ జిల్లాలోని షుక్రూ కెల్లర్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే నిర్దిష్ట సమాచారం మేరకు భద్రతా దళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఆపరేషన్ సమయంలో జరిగిన కాల్పులలో  ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరణించిన ఉగ్రవాదులు లస్కరే తోయిబా /  ది రెసిడెంట్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థలకు చెందినవారని భావిస్తున్నామని కాశ్మీర్ ఐజిపి వి కె బిర్డి  తెలిపారు.

విరామం

===================

పంజాబ్‌లో అమృత్‌సర్‌లో ఇథనాల్‌తో తయారు చేసిన కల్తీ మద్యం సేవించిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 21కి చేరుకుంది. నిన్న రాత్రి నాలుగు గ్రామాల ప్రజలు ఇథనాల్‌తో తయారు చేసిన కల్తీ మద్యం సేవించడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది.

===================

'ఆపరేషన్ సిందూర్' పై పదకొండు రోజుల దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం ఈ రోజు ప్రారంభమైంది. తిరంగ యాత్ర పేరిట ఈ ప్రచారం పాకిస్థాన్‌పై భారత సాయుధ దళాల విజయాన్ని ప్రముఖంగా ప్రస్తావించడమే లక్ష్యంగా పెట్టుకుంది. మాజీ సైనికులు, సామాజిక కార్యకర్తలు, సామాజిక సంస్థలు, బీజేపీ నాయకులు ఈ కార్యక్రమంలో

పాల్గొంటున్నారు. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రచారం పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను భారతదేశం ఎలా నాశనం చేసిందనే దానిపై దృష్టి సారిస్తుంది.

===================

గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలోని ప్రధాన ఓడరేవులు కార్గో నిర్వహణలో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని ఓడరేవులు 819 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో అది 855 మిలియన్ టన్నులకు పెరిగిందని, 4.3 శాతం వార్షిక వృద్ధి సాధించిందని పేర్కొంది. ఎరువుల కార్గో నిర్వహణలో 13 శాతం పెరుగుదల, నౌకల రాకపోకల పెరుగుదలకు దారితీసిందని తెలిపింది. ఈ విజయాల పట్ల కేంద్ర ఓడరేవుల, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

===================

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు పుదుచ్చేరిలో 3 నూతన నేర చట్టాల అమలును సమీక్షించారు. గత సంవత్సరం జులైలో అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం 2023 అనే ఆ మూడు నేర చట్టాలు అమల్లోకి వచ్చాయి. ఈ సమావేశంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాష్నాథన్, హోం మంత్రిత్వ శాఖలోని ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

===================

భారత్ - పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా వారం రోజుల విరామం తర్వాత, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2025 ఈ నెల 17వ తేదీన తిరిగి ప్రారంభమవుతుందని భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (BCCI) ప్రకటించింది. భారతదేశం 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన తర్వాత మే 9న ఐపీఎల్‌ని తాత్కాలికంగా నిలిపివేశారు. IPL పునఃప్రారంభమైన తర్వాత, మే 17న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరుగుతుంది. మే 29 నుండి ప్లే ఆఫ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. IPL ఫైనల్ మ్యాచ్ జూన్ 3న జరుగుతుంది. అయితే, మొహాలీ, ధర్మశాల స్టేడియంల్లో ఎటువంటి మ్యాచ్‌లు జరగవని బీసీసీఐ పేర్కొంది.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===================

దేశానికి అత్యధికంగా వర్షపాతానిచ్చే నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా కదులుతున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ రోజు మధ్యాహ్నం నాటికి నైరుతి రుతుపవనాలు దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతానికి చేరుకున్నాయని తెలిపింది. రుతుపవనాల ఆగమనం దృష్ట్యా గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులంతటితో పాటు దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. ఈనెల 27వ తేదీ నాటికి ఈ రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.